
మంత్రి దామోదర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, నాయకులు

ఆలయాభివృద్ధికి సహకరిస్తా..

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- అల్లాదుర్గం వెంకటేశ్వరాలయంలో అట్టహాసంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

7 లో

ఎల్లో అలర్ట్

ఉమ్మడి మెదక్ జిల్లాను వెంటాడుతున్న వర్ష భయం.. రైతుల్లో ఆందోళన

మెదక్ అర్బన్, మార్చి 20: ఉపరితల ద్రోణి ప్రభావంతో మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతల్లో మార్పు వచ్చింది. గతవారంతో పోలిస్తే ఈవారం జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీలు తగ్గాయి. ఈ సీజన్‌లో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతుండగా పలుచోట్ల దాదాపు 40 డిగ్రీల వరకు నమోదయ్యాయి. రెండుమూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో కురుసున్న ఆకాలు వర్షాలకు చేతికొచ్చే పంటలకు నష్టం వాటిల్లుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట చేతికందే దశలో..

రెండ్రోజులు ఉమ్మడి మెదక్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. గడిచిన 24 గంటల్లో జిల్లాలో మాసాయిపేట 1.0 మిల్లీమీటర్లు, కాగాజ్‌మద్దూర్ 1.3, చిప్పల్‌తుర్తి, నర్సాపూర్, దామరంచ, అల్లాదుర్గంలో 0.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం మెదక్ జిల్లాకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆకాల వర్షాలతో చేతికందే దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో వరి, మొక్కజొన్న చేతికొచ్చే దశలో ఉండగా.. మామిడి కోత దశకు చేరింది.


జహీరాబాద్‌లో దెబ్బతిన్న మామిడి తోట.. నేలకొరిగిన చెట్టు

రామాయంపేట, నిజాంపేట, చేగుంట, జహీరాబాద్, నారాయణఖేడ్, సిర్గాపూర్ తదితర మండలాల్లో ఇప్పటికే వర్షం, వడగండ్లతో రైతులు పంటలు నష్టపోయారు. మరో రెండు రోజులు వర్ష ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ పేర్కొంటున్నారు. ఆకాశం మేఘావృతమై ఉంటూ అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

సిర్గాపూర్ తహసీల్ కార్యాలయంలో డబ్బులు ఇవ్వనిదే ఏ పని కూడా జరగడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. అధికారులు తీరు మార్చుకోకపోతే.. కలెక్టర్‌ను తీసుకువచ్చి బండారం బయటపెడుతా.. ఇది మంగళవారం జరిగిన సిర్గాపూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి హెచ్చరిక.



సిర్గాపూర్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న నారాయణపై మండలవాసులు ఈ నెల 13న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆయనను ఆందోల్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అవినీతి వెలుగులోకి రావడంతో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈ మేరకు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్ కార్యాలయాల్లో అవినీతిపై ఏకంగా ఎమ్మెల్యే మండల సభలో ఇలాంటి హెచ్చరికలు జారీ చేయాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణుల నుంచి పట్టణాల వరకు అన్ని వర్గాలకు పని ఉండే తహసీల్దార్ కార్యాలయాల్లో కొందరు డబ్బులు ఇవ్వనిదే ఏ చిన్న పని కూడా చేయడం లేదు. ఇక్కడి వివిధ పనులపై వచ్చే వారి వద్ద నుంచి ప్రతీ పనికో రేటు కట్టి వసూలు చేస్తున్నారు. కింది స్థాయి నుంచి అధికారుల వరకు వాటాలు పంచుకుంటున్నట్లు అక్కడి సిబ్బందే చెప్పడం గమనార్హం.

పైసలిస్తేనే పని..!

ప్రతి పనికో రేటు..

- కింది స్థాయి నుంచి వాటాలు
- కాసులు కురిపిస్తున్న ధరణి
- కల్యాణలక్ష్మి దరఖాస్తుకూ వసూళ్లు
- తహసీల్దార్ కార్యాలయాల్లో కొందరి చేతివాటం



కల్హేర్, మార్చి 20: ధరణి పోర్టల్ తహసీల్ కార్యాలయ సిబ్బందికి కాసులు కురిపిస్తోంది. భూసమస్యల పరిష్కారానికి, రిజిస్ట్రేషన్ల కోసం తహసీల్ కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజల నుంచి సిబ్బంది, ఆపరేటర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ధరణి రిజిస్ట్రేషన్లకు అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా క్రయ, విక్రయదారుల నుంచి మధ్యవర్తుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. ఇందులో కార్యాలయ బాసులకూ వాటా ఉన్నట్లు ఆరోపణలొస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

వసూళ్లకు పక్కా ప్లాన్

ధరణి రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాలకు వచ్చే వారి నుంచి సిబ్బంది పక్కా ప్లాన్‌తో డబ్బులు దండుకుంటున్నారు. అవసరమున్నా, లేకున్నా రిజిస్ట్రేషన్ సమయంలో పాత రికార్డులు చూసుకోవాలని వచ్చిన వారికి సలహాలిచ్చి, పాత ప్రతులు ఇవ్వడానికి రూ.3 నుంచి నుంచి రూ.5 వేల వరకు దండుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత ఆపరేటర్లు, సిబ్బంది రూ.2 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం కల్హేర్ తహసీల్దార్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన వారి భూరిజిస్ట్రేషన్‌ను సమయం ముగిసిన తర్వాత చేయడం గమనార్హం. మధ్యవర్తుల కోరిక మేరకు రూ.15 వేలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకూ..

జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ పథకాల దరఖాస్తుదారుల నుంచి కొందరు ఒక్కో దరఖాస్తుకు రూ. 5 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక చెక్కుల మంజూరు సమయంలోనూ రూ.5 నుంచి రూ.10 వేల వరకూ దండుకున్నారు. ఇక సర్టిఫికెట్ల జారీకీ కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

స్థానిక ఆపరేటర్లను బదిలీ చేయాలి

తహసీల్దార్ కార్యాలయాల్లో స్థానికులే ధరణి ఆపరేటర్లు ఉండడంతో విచ్చలవిడిగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్ని ఫిర్యాదులొచ్చినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వీరిని బదిలీ అయినా చేయాలి, విధుల నుంచైనా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్.. లెక్కల మాస్టార్..

పాషాపూర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన రాహుల్‌రాజ్.. విద్యార్థులకు బోధన

మెదక్ అర్బన్, మార్చి 20: మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కాసేపు ఉపాధ్యాయుడిగా మారారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు చెప్పారు. మెదక్ మండలం ఖాజిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పాషాపూర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించి, గణిత పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

మాసాయిపేట: మాసాయిపేట మండలం రామాంతాపూర్ తండాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్‌బూత్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. జిల్లా పరిధిలో ఐదు నూతన పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయనవెంట నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్, అధికారులు, నాయకులు ఉన్నారు.

ఎన్నికల ఇంటలిజెన్స్ కమిటీ సమీక్ష

మెదక్: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీ మహేందర్, రెవెన్యూ, ఇన్‌కంటాక్స్, కమర్షియల్ టాక్స్, ఎల్‌డీఎం అధికారులతో ఎన్నికల ఇంటలిజెన్స్ కమిటీ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డబ్బు, గంజాయి, మద్యం, మత్తుపదార్థాల రవాణా జరగకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు.

అనంతరం ఆయన మండలాలవారీగా ఆర్డీవోలు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు నమోదు ప్రక్రియను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఓటు కల్పించాలని ఆదేశించారు.


పాషాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి లెక్కలు బోధిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నేడు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

తూప్రాన్, మార్చి 20: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేడు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 6న మెజార్టీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో చైర్మన్ బొంది రాఘవవేందర్‌గౌడ్ పదవి కోల్పోయారు. దీంతో, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కొత్త చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు చేశారు. మున్సిపాలిటీలో 16 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఉన్నారు. సమావేశం నిర్వహించేందుకు 9 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉంటుంది.



తూప్రాన్‌లో మున్సిపల్ కార్యాలయం

క్యాంపులో కౌన్సిలర్లు

తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన ఇన్‌చార్జి చైర్మన్‌తో కలిసి 10 మంది కౌన్సిలర్లు ప్రస్తుతం విహారయాత్రలకు వెళ్లారు. మాజీ చైర్మన్ వర్గం ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్నారు. వీరిలో ఓ కౌన్సిలర్, ఇద్దరు కౌన్సిలర్ల భర్తలపై క్రిమినల్ కేసులు నమోదవడంతో వారు గైర్హాజరయ్యే అవకాశం ఉన్నది. చైర్మన్ పదవి కోసం ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్, నాలుగోవార్డు సభ్యురాలు మామిండ్ల జ్యోతి ప్రయత్నిస్తున్నారు. ఇద్దరిలో కాంగ్రెస్ అధిష్ఠానం, కౌన్సిలర్ల అభిప్రాయం మేరకు ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశమున్నదని తెలుస్తున్నది.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

- ధరణి సమస్యలను పరిష్కరించండి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 20 : ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమష్టిగా చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. జిల్లాలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం తదితర మండలాల్లో చెరువులు, కుంటలు, ఇతరత్రా ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువులు, కుంటలను సర్వే చేసి ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించాలని, సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం తదితర మండలాల్లోని పెద్ద చెరువుల రికార్డులను వెంటనే అందజేయాలని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు నిర్దేశించారు. బొల్లారం ఎర్రకుంట చెరువులో ఏర్పాటు చేసిన వెంచర్ వివరాలు వెంటనే సమర్పించాలని సూచించారు. రెవెన్యూ మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని ఆదేశించారు. మైనింగ్ కోసం రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌వోసీ తప్పనిసరి అని, అనుమతి పొందిన మేరకే మైనింగ్ జరిగేలా నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ భూములన కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయితే పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ అధికారుల సహాయంతో ఆక్రమణలను తొలగించాలని నిర్దేశించారు. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలు చేపట్టకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, డీపీవో సాయిబాబా, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ మురళీధర్, ఆర్‌డీవో వసంతకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులంతా అందుబాటులో ఉండాలి
- సోషల్ మీడియాపై నిఘా
- మల్టీజోన్-2 ఐజీ సుధీర్‌బాబు

సంగారెడ్డి క్రైం, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు మల్టీజోన్-2 ఐజీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సోషల్ మీడియాపై దృష్టి పెట్టాలని జిల్లా పోలీసులకు సూచించినట్లు తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల నుంచి సంగారెడ్డి జిల్లాకు మద్యం, నగదు రవాణా జరుగకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, మెసేజ్‌లు చేసినా, ఓటర్లను ప్రభావితం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది జిల్లా ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎక్కడ సమస్య ఉన్నట్టు సమాచారం అందినా వెంటనే స్పందించాలని నిర్దేశించారు. త్వరగా స్పందించడం వల్ల నేర తీవ్రతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో జరిగిన లోపాలను గుర్తించి, అధిగమించి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఐజీ సుధీర్‌బాబు


సిద్దిపేటలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

తెలంగాణలో అన్ని స్థానాలు గెల్చుకుంటాం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

సిద్దిపేటక్రైం/గజ్వేల్, మార్చి 20 : తెలంగాణలో అన్ని పార్లమెంట్ స్థానాలను గెల్చుకుంటామని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట, గజ్వేల్‌లో పార్టీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సిద్దిపేటకు రైలు తీసుకొచ్చిన ఘనత బీజేపీదేనన్నారు. దేశానికి శ్రీరామరక్ష బీజేపీ, నరేంద్రమోదీనే అని స్పష్టం చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఈసారి లక్ష ఓట్ల మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ ఎంపీగా పదేళ్లపాటు ఉన్న వ్యక్తి ఏ రోజైనా తెలంగాణ కోసం మాట్లాడారా? అని ప్రశ్నించారు. 1999 తర్వాత మెదక్ పార్లమెంట్ పై జెండా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక బీఆర్ఎస్ ఖతం అంటున్న రేవంత్‌రెడ్డి మొదట తన గేట్లు బద్దలవకుండా చూసుకోవాలని రఘునందన్‌రావు హితవు పలికారు.

మల్లన్నగుట్టలో ఒగ్గు పూజారుల ఘర్షణ

- కర్రలు, రాళ్లతో కొట్టుకున్న ఇరువర్గాలు
- రేకులకుంట మల్లన్న ఆలయం వద్ద ఉద్రిక్తత

దుబ్బాక, మార్చి20 : సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని రేకులకుంట మల్లన్నగుట్ట ఆలయంలో ఒగ్గుపూజారుల నియామకంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదం బుధవారం ఘర్షణకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. రేకులకుంట మల్లన్న ఆలయంలో 65 మంది ఒగ్గు పూజారులు పనిచేస్తున్నారు. కొన్నాళ్లుగా వీరితో పాటు మరో 80మంది తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని మల్లయపల్లి, రాజక్కపేట, దుబ్బాక, దూమాల నుంచి ఒగ్గు పూజారులుగా పని చేస్తున్నారు. తమకు కూడా హక్కు ఉంటుందని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ఒగ్గు పూజారులు 2011 నుంచి డిమాండ్ చేస్తున్నారు. అయితే, వారం రోజుల దేవాదాయశాఖ కమ్మర్‌పల్లికి చెందిన ఒగ్గు పూజారులకు హక్కు కల్పిస్తూ, గుర్తింపు కార్డులను జారీ చేసింది. దీంతో వారం రోజుల నుంచి ఆలయం వద్ద ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొన్నది. మాటామాటా పెరిగి బుధవారం ఒక్కసారిగా రాళ్లవర్షం కురిపించుకున్నారు. కర్రలతో ఒకరిపై మరొకరు దాడుల చేసుకున్నారు. భక్తుల రద్దీ ఉండటంతో ఎవరు, ఎవరిమీద దాడి చేస్తున్నారనేది అర్థంకానీ పరిస్థితి నెలకొన్నది. విషయం తెలుసుకున్న పోలీసులు దుబ్బాక ఎస్‌ఐ గంగారాం ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్నారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. రాత్రి వరకు పోలీసులు ఇంకా కేసు నమోదు చేయలేదు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.


మల్లన్న ఆలయంలో దాడి చేసుకుంటున్న ఒగ్గుపూజారులు


గాయాలై పడి ఉన్న ఒగ్గుపూజారులు

ఆర్థరైటిస్‌కు రోబోటిక్ చికిత్స

సిద్దిపేట అర్బన్, మార్చి 20 : కీళ్ల నొప్పులు, మోకాళ్ల అరుగుదల, జాయింట్ పెయిన్ తదితర ఆర్థరైటిస్ వ్యాధులకు సంబంధించి రోబోతో ఆపరేషన్‌తో పాటు ఫిజియోథెరపి చికిత్స అందిస్తున్నామని యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలామంది ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతూ ఆపరేషన్ అంటే భయానికి గురవుతున్నారని, రోబోటిక్ ఆపరేషన్ ద్వారా ఎలాంటి భయం లేకుండా సులువైన చికిత్స అందించొచ్చని ఆయన తెలిపారు. ఆర్థరైటిస్ సమస్య రాగానే ఆపరేషన్ అవసరం ఉండకపోవచ్చని కొన్ని రకాల ఫిజియోథెరపీ వ్యాయామాల ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. విపరీతమైన కీళ్ల నొప్పులు ఉంటే ఆపరేషన్ తప్పదని, అటువంటి వారికి రోబోటిక్ ద్వారా ఫిజియోథెరపితో పాటు ఎలాంటి ఇబ్బందులు లేని ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఆపరేషన్ చేసుకున్న పేషెంట్ నాలుగు గంటల సమయం తర్వాత నడక ప్రారంభించవచ్చని ఆయన వివరించారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో రోబోటిక్ చికిత్స అందిస్తున్నామని తెలియజేశారు. అలాగే, ప్రతీ నెల మూడో మంగళవారం కరీంనగర్‌లో కూడా అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ చికిత్స త్వరలో ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలకు కూడా రోబోటిక్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రోబోటిక్ ఆపరేషన్ ద్వారా చికిత్స పొందిన వారు సమావేశంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. సమావేశంలో యశోద ఆసుపత్రి సిబ్బందితోపాటు చికిత్స పొందిన వారు పాల్గొన్నారు.

అసైన్డ్ భూమిలో

మట్టి రవాణాను అడ్డుకున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మట్టి రవాణా నిలిచిపోవడంతో ఆగిన టిప్పర్లు

కొల్చారం, మార్చి 20 : ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'అసైన్డ్ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు' వార్తకు అధికారులు స్పందించారు. కొల్చారం మండలం దేవుని వెంకటాపూర్‌లోని అసైన్డ్ భూమిలో నుంచి మట్టి తవ్వకాలను చేపట్టి టిప్పర్ల ద్వారా తరలించడాన్ని బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిలిపివేయించారు. పోలీసుల ఆదేశాలతో టిప్పర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

ప్రేమ విఫలమైందని ఆత్మహత్యాయత్నం..

చికిత్సపొందుతు యువకుడి మృతి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 20 : ప్రేమ విఫలమైందని ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందిన సంఘటన హుస్నాబాద్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామానికి చెందిన అల్లెపు శివ అలియాస్ రుద్రయ్య(20) కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఘనపురం గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుందామని అమ్మాయిని తీసుకుని తన ఇంటికి వచ్చాడు. అమ్మాయి తల్లితండ్రులు పెళ్లికి నిరాకరించారు. మేజర్ అయిన తర్వాత పెళ్లి చేస్తామని అమ్మాయిని తీసుకెళ్లారు. ఆ తర్వాత అమ్మాయి జోలికి వస్తే వారి చంపేస్తామని కుటుంబసభ్యులు రుద్రయ్యను బెదిరించారు. ప్రేమ విఫలమైందని మనస్థాపం చెందిన రుద్రయ్య ఈనెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రుద్రయ్య తల్లి తండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దిపేటలో రజాకార్ చిత్ర బృందం సందడి

సిద్దిపేట క్రైం, మార్చి 20 : సిద్దిపేట పట్టణంలో బుధవారం రజాకర్ చిత్ర బృందం సందడి చేశారు. ముందుగా పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిత్రం ప్రదర్శింపబడుతున్న శ్రీనివాస థియేటర్‌లో చిత్ర బృందం ప్రేక్షకులను పలకరించింది. ఈ సందర్భంగా దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ ఇది మన చరిత్ర, మన పూర్వీకుల చరిత్ర అని, దీనిని అందరూ ఆదరించాలని కోరారు. అనంతరం చాకలి ఐలమ్మ పాత్రలో నటించిన నటి ఇంద్రజ మాట్లాడుతూ చిత్రాన్ని చూసి మన పోరాట చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఈ చిత్రాన్ని 200 రోజులు ఆదరించాలని కోరారు.





చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలదండ వేస్తున్న నటి ఇంద్రజ, శ్రీనివాస థియేటర్‌లో రజాకార్ చిత్ర బృందం



కొమురవెల్లిలో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న మల్లన్న ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్

సనాతన ధర్మాన్ని కాపాడాలి

- గోరక్షణకు నడుం బిగించాలి
- సద్గురు మహాదేవ్ స్వామి
- కొమురవెల్లికి చేరిన మహా పాదయాత్ర

కొమురవెల్లి/చేర్యాల, మార్చి 20 : సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని సద్గురు మహాదేవ్ స్వామిజీ ప్రబోధించారు. జగద్గురు రేణుకాచార్య జయంతిని పురస్కరించుకుని సద్గురు మహాదేవ్ స్వామీజీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుడిమెట్ గ్రామం నుంచి యాదాద్రి-భువనగిరి జిల్లా కొలనుపాకలోని సోమేశ్వరాలయం వరకు 2 వేల మంది భక్తులతో చేపట్టిన మహాపాదయాత్ర బుధవారం కొమురవెల్లి, చేర్యాల మండలాలకు చేరుకున్నది. ఈ సందర్భంగా కొమురవెల్లిలోని టీటీడీ కల్యాణ మండపంలో లింగాయత్ సమాజం మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అధ్యక్షతన ధర్మసభను ఏర్పాటు చేశారు. సద్గురు మహాదేవ్ స్వామిజీ మాట్లాడుతూ దేశంలో పుట్టిన ప్రతీ హిందువు దైవాన్ని పూజించాలని, ధర్మాన్ని కాపాడాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఆరాధించాలని సూచించారు. గోరక్షణకు నడుంబిగించాలన్నారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ అన్ని కులాలను ఆదరించే కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగాయత్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని, లింగ బలిజ సమాజాన్ని బీసీలలో చేర్చింది కూడా కాంగ్రెస్ పార్టీ అని వారు గుర్తుచేశారు. స్వామీ ప్రబోధించిన ప్రతి అంశాన్నీ పరిగణలోకి తీసుకుని హిందూ ధర్మం వ్యాప్తికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు శివప్ప, మల్లన్న ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, రాష్ట్ర లింగాయత్ సమన్వయ సమితి ఉపాధ్యక్షుడు బర్మని మల్లికార్జున్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల మల్లికార్జున్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సూరం కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు. చేర్యాలకు చేరుకున్న పాదయాత్రకు వీరశైవ లింగాయత్ సమాజం మండల ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొనగా, పట్టణ ప్రధాన రహదారి గుండా శివవనామస్మరణతో పాదయాత్రను కొనసాగించారు.

లక్ష్మీనృసింహుడి కల్యాణోత్సవానికి

పట్టువస్త్రాల తయారీ ప్రారంభం

వర్గల్, మార్చి 20 : వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహా స్వామి క్షేత్రంలో నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 31న స్వామి వారి తిరు కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వస్త్రాలను సమర్పించుటకు నాచగిరి క్షేత్రం వద్ద బుధవారం పట్టువస్త్రాల తయారీని ప్రారంభించారు. దాత నర్సింగరావు, హైమావతి దంపతుల సహకారంతో అఖిల భారత పద్మశాలి కళావైదిక సంఘం హైదరాబాద్ వారు చేనేత మగ్గం ద్వారా పట్టువస్త్రాలను తయారు చేస్తున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ మగ్గం నేస్తూ వస్త్రాల తయారీని ప్రారంభించారు.



మగ్గం నేస్తున్న కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ

ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తా..

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- అల్లాదుర్గం వెంకటేశ్వరాలయంలో అట్టహాసంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

అల్లాదుర్గం, మార్చి 20 : ప్రసిద్ధి చెందిన, చారిత్రాత్మకమైన అల్లాదుర్గంలోని వెంకటేశ్వర ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర ఆలయాభివృద్ధికి భక్తులు ముందుకు రావడం ఎంతో హర్షణీయమన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రముఖ పురోహితుడు శిలంకోట ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో తెల్లవారుజాము నుంచే విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సుప్రభాత సేవ మూల విధి, రక్షాబంధనం, అఖండ దీపస్థాపన, ఆచార్యాది, రుత్విక్ వరుణం, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, కుండ సంస్కారం, అగ్ని మదన పూర్వక అగ్ని ప్రతిష్ఠ తదితర పూజలను చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ మంత్రి దామోదర్‌ను సత్కరించారు.



అల్లాదుర్గం వెంకటేశ్వర ఆలయంలోని యాగశాలలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

లింగాయత్ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు పి.సంగమేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, ఎంపీపీ అనీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మా ప్లాట్లను ముంచేశారు

- నీటిపారుదల శాఖ అధికారులే అమీన్‌పూర్ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పెంచారు
- దిగువకు నీరు వెళ్లే తూములు తెరవాలి
- సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలి
- అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితుల జేఏసీ విజ్ఞప్తి

పంజాగుట్ట, మార్చి20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ గ్రామంలోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని నీటిపారుదల శాఖ అధికారులు పెంచి తమ ప్లాట్లను ముంపునకు గురిచేశారని అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితుల జేఏసీ ఆరోపించింది. చెరువుకు దిగువన నీరు వెళ్లే తూములు తెరవాలని వారు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని జేఏసీ చైర్మన్ చిరునామా సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ సభ్యులతో కలిసి చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ అమీన్‌పూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 193 నుంచి 200 వరకు, 202, 205, 215, 230, 323తో పాటు పలు నంబర్లలోని భూమిలో 30 సంవత్సరాల క్రితం 20కిపైగా లేఅవుట్లు వేయగా పైసాపైసా కూడబెట్టి ఐదు వేలమందిమి కొనుగోలు చేశామన్నారు. పంచాయతీ, హుడా, హెచ్‌ఎండీఏ, తదితర విభాగాల అనుమతులు కూడా ఉన్నాయన్నారు. పక్కనే 93.5 ఎకరాల్లో పెద్దచెరువు ఉండగా, నీటిపారుదల శాఖ అధికారులు కుట్ర పూరితంగా చెరువుపై భాగంలో ఉన్న కొత్త చెరువుతో అనుసంధానం చేస్తూ కొత్తగా ఎఫ్‌టీఎల్ సృష్టించడంతో తమ ప్లాట్లు మునిగిపోయాయన్నారు. దీంతో చెరువు విస్తీర్ణం 450 ఎకరాలకు పెరిగిందన్నారు. చెరువుకు దిగువన ఉన్న రెండు తూముల నుంచి నీరు వెళ్లకుండా మూసి వేయడంతో ఎగువ నుంచి వచ్చే పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు, వర్షపు నీటితో తమ ప్లాట్లు నిండిపోయాయన్నారు.



సమావేశంలో పాల్గొన్న ముంపు బాధితుల జేఏసీ ప్రతినిధులు

నాలుగు సంవత్సరాల నుంచి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. తాము కొనుగోలు చేసినవన్నీ పట్టా భూములలోని వేనన్నారు.ఇటీవల కాలంలో స్థలాల రేట్లు పెరుగుతుండడంతో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల కళ్లు తమ ప్లాట్లపై పడిందని, అధికారులతో కుమ్మక్కై తమ ప్లాట్లను చెరువులో ముంచారన్నారు. తాము తక్కువ ధరకే వాటిని విక్రయిస్తే కొనుగోలు చేయాలని చూస్తున్నారన్నారన్నారు. అధికారులు కూడా వారు చెప్పినట్టే చేస్తుండడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొంత మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారని, కొన్ని పూర్తయ్యే దశలో ఉండగా మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు ఆ ఇళ్ల వద్దకు వెళ్లనివ్వడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. గత నెల ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో జేఏసీ వైస్ చైర్మన్ వీఎస్‌ఆర్ బ్రహ్మానందరావు, కోశాధికారి టి.వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులు పి.విజయ్‌కుమార్‌రెడ్డి, డి.నర్సింగరావు, ఏ.శేషాతల్ప సాయి, కాసోజు నవనీత, ప్లాట్ల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



చిన్నశంకరంపేటలో చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ పరిశీలిస్తున్న కలెక్టర్

చిన్నశంకరంపేట/రామాయంపేట, మార్చి 20: ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం చిన్నశంకరంపేట శివారు మెదక్ - చేగుంట రహదారిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన సందర్శించి వాహన తనిఖీల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తప్పనిసరి ఎస్ఎస్‌టీంలు తనిఖీ చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా కోసం ఏర్పాటు చేసిన టీం అధికారులు మెరుగైన పనితీరును కనబర్చాలని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద భారీ బందోబస్తుతో పాటు నిఘా నేత్రాలు కట్టుదిట్టంగా 24 గంటలు పనిచేస్తాయన్నారు. అనంతరం ఎస్ఎస్‌టీంలకు పలు సూచనలు, సలహాలు చేశారు. రామాయంపేట మండలంలోని అక్కన్నపేట చెక్‌పోస్టు వద్ద కలెక్టర్ తనిఖీలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ

జహీరాబాద్, మార్చి 20 : జహీరాబాద్ నియోజకవర్గంలోని మనియార్‌పల్లి, సిద్దాపూర్ తాండ, చిరాగ్‌పల్లి, గౌసాబాద్, మల్గి, హుసెల్లీ తదితర ప్రాంతాల్లో సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతీరోజు తనఖీలు చేపడుతున్నారు. బుధవారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు న్యాల్‌కల్ మండలంలో జరిగే కార్యక్రమాలకు తన వాహనంలో వెళ్తుండగా బీదర్ చౌరస్తా, గంగ్వార్ చౌరస్తాల వద్ద పోలీసులు కారును ఆపి తనిఖీ చేశారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి

గొర్ల కాపరి మృతి

టేక్మాల్, మార్చి20 : ఓ గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని బొడ్మాట్‌పల్లిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం తునిగండ్ల గ్రామానికి చెందిన జంగంపల్లి రాములు(55) మండలంలోని ఆయా గ్రామాల్లో తిరుగుతూ గొర్లను మేపుతున్నాడు. గొర్లకు నీళ్ల తాగేంచేందుకు బొడ్మాట్‌పల్లి చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో మృతిదేహని వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ తుక్కయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చండూరులో మరొకరు..

చిలప్‌చేడ్, మార్చి20: చెరువులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన చండూర్‌లో బుధవారం చోటు చేసుకున్నది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామరాయని మహిపాల్ రెడ్డి(43) మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి పొలానికి వెళ్లి ఎంత సేపటికి రాలేదు. గ్రామస్థుల సహకారంతో వెతుకుతుండగా గ్రామ శివారులో మహిపాల్‌రెడ్డి టవల్ కనిపించడంతో చెరువులో వెతకగా మృతదేహం లబించింది. భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌రిచ్ పారిశ్రామిక భూముల్లో సర్వే

జిన్నారం, మార్చి 20: బొల్లారం పారిశ్రామిక వాడ ఎన్‌రిచ్‌లో ఖాళీ స్థలాల ఆక్రమణల నిగ్గు తేల్చేందుకు రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారు. బొల్లారంలోని సర్వే నంబరు 81, 84లో 185 ఎకరాలను గతంలో ఎన్‌రిచ్ పారిశ్రామిక వాడ కోసం కేటాయించారు. ఇందులో పరిశ్రమలతో పాటు పార్కులు, ఇతర అవసరాల కోసం కొంత భూమిని కేటాయించగా.. ఆ స్థలాలు కబ్జా అవుతున్నాయి. దీంతో జిల్లా అధికారుల ఆదేశాలతో సర్వేయర్లు రామభద్ర, కోటేశ్వర్‌రావులు బుధవారం సర్వే ప్రారంభించారు.

జాతీయ రహదారి నిర్మాణానికి తుది సర్వే

నారాయణఖేడ్, మార్చి 20: నారాయణఖేడ్- నిజాంపేట్- బీదర్ 161బీ జాతీయ రహదారి నిర్మాణానికి తుది సర్వేను ముమ్మరంగా చేస్తున్నారు. నిజాంపేట్ నుంచి బీదర్ వరకు 45 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.521 కోట్లు మంజూరు చేసింది. టెండర్లను ఆర్‌ఎంఎన్ ఏజేన్సీ దక్కించుకున్నది. త్వరలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నందున తుది సర్వే పనులు ముమ్మరం చేశారు.

వడగళ్లతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నిజాంపేట, మార్చి 20: వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మండల పరిధిలోని నందిగామ, జడ్ చెరువు తండా, బచ్చు రాజుపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను బుధవారం సందర్శించి, రైతులకు భరోసా కల్పించారు. ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఐదు రోజుల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన బక్కొళ్ల మల్లేశం కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం ద్వారా అందే సాయాన్ని త్వరగా వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఆయనవెంట పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చెప్పెట ముత్యంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మండలాధ్యక్షుడు మారుతి, పట్టణ అధ్యక్షుడు నసీరొద్దీన్, ఆకుల బాలయ్య, నరేందర్, వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇవ్వాలి

నారాయణఖేడ్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పంటలు చేతికి వస్తున్న తరుణంలో నష్టం జరగడంతో పెట్టుబడులు సైతం రాక రైతులు తక్షణ సహాయంగా ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



సంగారెడ్డిలో మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, మార్చి 20: విద్యుత్ శాఖ జోగిపేట స్టోర్ పరిధిలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కోరారు. ఈ మేరకు సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సారా ప్రభాకర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

నగదు రహిత వైద్య సేవలందించండి

విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యసేవలందించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రాన్ని అందజేశారు. నగదు రహిత వైద్యసౌకర్యం లేక, సకాలంలో మెడికల్ రీయింబర్స్‌మెంటు అందక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈహెచ్‌ఎస్ ట్రస్ట్ బోర్డు సీఈవోను, ఉద్యోగ పెన్షనర్ల సంఘాల ప్రతినిధులను సభ్యులుగా నియమించి పెన్షనర్ల మూలవేతనాల నుంచి ఒక శాతం మినహాయించి ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం జిల్లా నాయకులు నవాబురెడ్డి, జగదీశ్వర్, బసవేశ్వర్, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి మహిళ అదృశ్యం



అదృశ్యమైన షీలా, పిల్లలు

చిలప్‌చెడ్, మార్చి 20: ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని బద్రియా తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బద్రియా తండాకు చెందిన పాత్‌లోత్ శ్రీనివాస్, షీలా దంపతులు. వారికి ఇద్దరు కుమారులు అభిరాం, రాఘురాం ఉన్నారు. గత కొంత కాలంగా దంపతులిద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో షీలా తరచూ తల్లిగారింటికి(మెదక్ మండలంలోని లక్ష్మీనగర్ తండా) వెళ్లేది. ఈ నెల 19న మళ్లీ గొడవ జరగడంతో ఇద్దరి పిల్లల్ని తీసుకోని ఇంటికి తాళం వేసి షీలా కనిపించకుండా పోయింది. ఈ మేరకు బుధవారం శ్రీనివాస్ చిలప్‌చేడ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలిపోయిన కల్వర్టు.. పట్టించుకోని అధికారులు



ఎల్గోయి శివారులో కల్వర్టు కూలి, ప్రమాదకరంగా మారిన దృశ్యం

మనూరు, మార్చి 20: మనూరు మండలంలోని ఎల్గోయి రోడ్డుపై నిర్మించిన కల్వర్టు రెండు సంవత్సరాల క్రితం కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు అధికారులకు, స్థానిక నాయకులకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కల్వర్టు కూలడంతో ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రేగోడు-మర్పల్లి రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో!



రేగోడు - మర్పల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం

రేగోడు, మార్చి 20: పెద్దశంకరంపేట నుంచి పోచారం వరకు రేగోడు మీదుగా డబుల్ రోడ్డు పనులను ఐదేళ్ల క్రితం పూర్తి చేశారు. అయితే మండల కేంద్రమైన రేగోడు నుంచి మర్పల్లి వరకు రోడ్డు పనులు పూర్తి చేసినా మధ్యలో చేపట్టాల్సిన బ్రిడ్జి నిర్మాణాన్ని వదిలేశారు. దాదాపు 500 మీటర్ల రోడ్డు, బ్రిడ్జి పనులను వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలుకోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జిన్నారం, మార్చి 20: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉమ్మడి జిన్నారం మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీకాంత్, ఏఈ రాజులు తెలిపారు. గుమ్మడిదల సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కోసం గురువారం మధ్యాహ్నం 1నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నామని, సబ్‌స్టేషన్ పరిధిలోని గడ్డపోతారం, కాజీపల్లి, వావిలాల తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మనోహరాబాద్, మార్చి 20: మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ అజయ్ మిశ్రా, సీఈఓ మదన్ మోహన్‌రావు ప్రారంభించారు. జీఎస్‌టీ పరిశ్రమ మేనేజర్ శాంతి సహకారంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డా, శ్రీనివాస్‌రావు, జిల్లా స్టేట్ ఎంసీ మెంబర్ గోపికృష్ణ, ఏలేటీ రాజశేఖర్, స్వర్ణలత, సుభాచంద్రబోస్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనరసింహగౌడ్, ఉదయ్ రంజాన్‌గౌడ్, కిరణ్, వేణుగోపాల్, నరేష్ పాల్గొన్నారు.

చిన్నారి సంగీత కుటుంబాన్ని ఆదుకోవాలి

కౌడిపల్లి, మార్చి 20: రెండు రోజుల క్రితం గాలికి ఇంటి పైకప్పు రేకులతో పాటు ఎగిరి పోయి మృతి చెందిన మండల పరిధిలోని జాజితండాకు చెందిన చిన్నార సంగీత కుటుంబాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితలక్ష్మారెడ్డి బుధవారం పరామర్శించారు. చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు నాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, రాజిపేట ఎంపీటీసీ ప్రవీణ్, నాయకులు కిషోర్‌గౌడ్, రామాంజనేయులు, ప్రతాప్ గౌడ్ ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

శివ్వంపేట, మార్చి 20: మండల పరిధిలోని రెడ్యాతండా పంచాయతీ పరిధిలోని వెంక్యాతండాకు చెందిన భానోత్ ప్రకాష్‌కు పదిరోజుల క్రితం జన్మించిన కొడుకు గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అందుకు అవసరమైన రూ.లక్షా50వేలు ప్రభుత్వం నుంచి మంజూరవగా.. ఎల్‌వోసీని బాధిత కుటుంబీకులు బుధవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీపీ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, వేణుగోపాల్ రెడ్డి, హన్మంతరావు, లాయక్, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేగోడుకు గ్రంథాలయ భవనం

రేగోడు, మార్చి 20: రేగోడుకు గ్రంథాలయ భవనం మంజూరైందని, భవన నిర్మాణానికి శ్రీకారం చుడతామని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ అన్నారు. బుధవారం రేగోడు కేటాయించిన స్థలాన్ని తహసీల్దార్ బాలలక్ష్మితో కలిసి పరిశీలించారు. భవనానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని, వారంలో పనులను ప్రారంభిస్తామని వంశీకృష్ణ తెలిపారు.

మధ్యాహ్న భోజనం బడుల్లోనే వండాలి



రాజిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

హవేళిఘణపూర్, మార్చి 20: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లోనే వండి, విద్యార్థులకు పెట్టాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. బుధవారం మండలంలోని వాడి, రాజిపేట ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలన్నారు. వాడి పాఠశాలలో దాతల సాయంతో నిర్మిస్తున్న గదులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. ఆయన వెంట ఎంఈవో నీలకంఠం, ఉపాధ్యాయులు ఉన్నారు.

అనాథ పిల్లలను అక్కున చేర్చుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి రూరల్, మార్చి 20: అనాథ పిల్లలను ఉన్నత స్థితిలో ఉన్నవారు అక్కున చేర్చుకోవాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు కోరారు. సంగారెడ్డిలోని అనాథ పిల్లలతో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న అనాథ పిల్లలను చదివించి, విద్యావంతులను చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం డ్రై రేషన్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డేనియల్ ప్రవీణ్‌కుమార్, స్కోప్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉప్పలయ్య, ప్రతినిధి సైతులు, మాణయ్య, స్కోప్ మేనేజర్ దుర్గప్రసాద్, మౌనిక, జ్యోతి, లక్ష్మి, నవనీత, ప్రమీల, సంతోష, రాణి, ఎలిషా, శాంతి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలకు ముసుగా?

నారాయణఖేడ్, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల కోడ్ పేరిట అంబేడ్కర్ విగ్రహాలకు ముసుగులు వేయడం సరికాదని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ అన్నారు. బుధవారం ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజకీయాలకు అతీతుడన్నారు. జిల్లాలోని అనేక చోట్ల అంబేడ్కర్‌తో పాటు పాటు స్వామి వివేకానంద, భగత్‌సింగ్, చాకలి ఐలమ్మ విగ్రహాలకు ముసుగులు వేయడం దారుణమన్నారు. వేసిన ముసుగులను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నితిన్, సుభాష్, అఖిల్, జోసెఫ్, సీమోన్, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన

వెల్దుర్తి, మార్చి 20: వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వెల్దుర్తి, మాసాయిపేట మండలాల బీఎల్‌వోలకు ఫారం-12డి పై డీఎంఎల్‌టీ శివశంకర్, స్థానిక తహసీల్దార్ సురేష్‌కుమార్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 85సంవత్సరాలు నిండిన వారు, దివ్యాంగులు లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకునే అవకాశం ఉన్నదన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి 85సంవత్సరాలు నిండినవారిని, దివ్యాంగులను గుర్తించి వారి వివరాలను ఫారమ్-12డిలో నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించాలని సూచించారు. విధుల పట్ల బీఎల్‌వోలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ జయభరత్‌రెడ్డి, సర్వేయర్ యాదగిరిగౌడ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న డీఎంఎల్‌టి శివశంకర్

‘ధరణి’లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

అల్లాదుర్గం, మార్చి 20: ధరణి పోర్టల్‌లో నెలకొన్న పలు సమస్యలను త్వరగా పరిష్కరించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, ధరణిలో నెలకొన్న పలు సమస్యలపై తహసీల్దార్ సతీష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

పెద్దశంకరంపేట: పట్టణ శివారులోని ప్రభుత్వ భూములను బుధవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన 8మందికి నోటీసులు అందజేసినట్లు తహసీల్దార్ గ్రేస్‌బాయ్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. వారిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆయనవెంట ఆర్‌ఐ శర్మప్ప, సర్వేయర్ నాగరాణి ఉన్నారు.

ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలి

● నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి

నారాయణఖేడ్, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను విధిగా పాటిస్తూ, అధికారులకు సహకరించాలని ఆర్డీవో అశోక చక్రవర్తి సూచించారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



నర్సాపూర్‌లో ప్రత్యేక బలగాలతో పోలీసుల కవాతు

నర్సాపూర్‌లో పోలీసు బలగాల కవాతు

నర్సాపూర్: పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ప్రజలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో నర్సాపూర్‌లో ప్రత్యేక బలగాలతో పాటు స్థానిక పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్ నేతృత్వంలో సీఐఎస్ఎఫ్ బలగాలతో పాటు స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారని చెప్పారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● జిల్లా వెల్ఫేర్ అధికారిణి లలితకుమారి



జహీరాబాద్‌లో చిన్నారులకు నిర్వహించిన అన్నప్రాసన కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారిణి లలితకుమారి

జహీరాబాద్, మార్చి 20: మహిళల ఆరోగ్యంపై అంగన్‌వాడి ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వెల్ఫేర్ అధికారి లలితకుమారి పేర్కొన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం జహీరాబాద్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణులు పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

తూప్రాన్‌లో

తూప్రాన్: తూప్రాన్ పట్టణంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం చేపట్టారు. గర్భిణిలు, బాలింతలు, పిల్లలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాలతో కూడిన వంటలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, ఏఎన్ఎం విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్లు ఇందిరా, పద్మ పాల్గొన్నారు.

ఈటలను కలిసిన పులిమామిడి రాజు



ఈటల రాజేందర్‌ను సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పులిమామిడి రాజు

సదాశివపేట, మార్చి 20: మాజీ మంత్రి, బీజేపీ జాతీయ నేత ఈటల రాజేందర్‌ను బుధవారం సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి పులిమామిడి రాజు శామీర్‌పేట్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈటల రాజేందర్ తెలంగాణ ప్రజల గొంతుక అని పులిమామిడి రాజు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి ఈటలను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్ యువసేన నాయకులు నల్ల సాయి, తాలెల్మ రాము, సోమశంకర్, మునిపల్లి రమేష్ పాల్గొన్నారు.

● మనోహరాబాద్: గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, ప్రజలు ఈటల రాజేందర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మనోహరాబాద్ మండలం నుంచి రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకుడు చంద్రశేఖర్ ముదిరాజ్ ఈటలను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు బీజేపీ నాయకులు నాగరాజు, కృష్ణ, రాజు, వెంకటేష్, సరేష్, నత్తి మల్లేష్, మురళి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ మూఢ రాచందర్

నారాయణఖేడ్, మార్చి 20: ఖేడ్ జంట గ్రామమైన మంగలిపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ మూఢ రాంచందర్ బుధవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు రాంచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, వినోద్‌పటేల్, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.

27న రైస్‌మిల్ ఆస్తుల వేలం

కొల్చారం, మార్చి 20: ఈ నెల 27న ఉదయం 11 గంటలకు కొల్చారం మండలం వరిగుంతంలోని మెస్సర్స్ శ్రీ సీతారామాంజనేయ రైస్‌మిల్ ఆస్తుల వేలం నిర్వహించనున్నట్లు కొల్చారం తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా బుధవారం ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ బకాయిలు చెల్లించని నర్సాపూర్ పట్టణానికి చెందిన పైడి శ్రీధర్‌గుప్తాకు చెందిన మెస్సర్స్ శ్రీ సీతారామాంజనేయ ఇండస్ట్రీస్ (రైస్‌మిల్ మరియు వ్యవసాయేతర భూములు)ను తెలంగాణ రెవెన్యూ రికవరీ చట్టం 1864 ప్రకారం వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 14న బహిరంగ వేలం జరుపుటకు నిర్ణయించినప్పటికీ ఒక్కరు కూడా బిడ్ నమోదు చేయనందున తిరిగి ఈ నెల 27న వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కల్హేర్, మార్చి 20: మండల పరిధిలోని బీబీపేట శివారులో బుధవారం అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిర్గాపూర్, కల్హేర్ మండలాల సరిహద్దులోని పోచాపూర్ చౌరాస్తా సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టగా బీబీపేట తండాకు చెందిన శివరాం అక్రమంగా తీసుకెళ్తున్న రూ.24 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శివరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

● సీఐటీయూ జిల్లా నాయకుల డిమాండ్

నారాయణఖేడ్, మార్చి 20: మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. పలు డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు బాబురావు మాట్లాడుతూ.. అన్నింటి ధరలు విపరీతంగా పెరిగినా కనీస వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కనీస వేతనంగా రూ.28,223 అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం స్థానిక నాయకులు సతీష్, రాజు, కుమార్, చంద్రకళ, శకుంతల, రవి, కార్మికులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు